క్లుప్తంగా

పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ

చాగల్లు: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి మల్లిపూడి ధనరాజు అన్నారు. కొవ్వూరు పట్టణానికి చెందిన మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మల్లవరంలోని నిరుపేద కుటుంబాలకు బియ్యం అందజేశారు. 17 కుటుంబాల వారికి నాణ్యమైన బియ్యాన్ని సర్పంచ్ కోడూరి లక్ష్మీ సుభాషిణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాలాది చిన్ని, కె.రాణి, జంగం నాగులు, అయినం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు 'మానవత' ఆర్థిక సాయం



వేగేశ్వరపురంలో వృద్ధుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురానికి చెందిన గంగరాజు అనే వృద్ధుడి వైద్య ఖర్చుల నిమిత్తం ఆదివారం మానవత సంస్థ మండలశాఖ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. మానవత సంస్థ ద్వారా రూ.5 వేలు అందజేశారు. ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు అదనంగా మరో రెండు వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండలశాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు, వి. చంద్రయ్య, తిగిరిపల్లి దోసాలు, అంకెం సురేష్, నాగభూషగుప్త తదితరులు పాల్గొన్నారు.

కాటకోటేశ్వరంలో డ్వాక్రా రుణాల దుర్వినియోగం!

నిడదవోలు రూరల్: మండలంలోని కాట కోటేశ్వరం గ్రామంలో డ్వాక్రా రుణాలు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామానికి చెందిన వీఓఏ రూ.2 లక్షల వరకూ స్వాహా చేసినట్టు తెలిసింది. ఆ సొమ్ములు తిరిగి డ్వాక్రా సభ్యులకు చెల్లించేందుకు గ్రామ పెద్దల సమక్షంలో వీఓఏ అంగీకరించినట్టు సమాచారం. ఈ విషయంపై ఏపీఎం శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు దుర్వినియోగం జరిగినట్లు తనకు ఎటువంటి ఫిర్యాదూ రాలేదని చెప్పారు.

200 మందికి వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: ఆరోగ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని రాయల్ హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ డాక్టర్ బిందు అన్నారు. కాతేరు పాత పంచాయతీ ఆవరణలో ఆదివారం కాతేరు యూత్ సర్కిల్ సహకారంతో రాయల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా రోగులను వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు జరిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్య చికిత్స అందించారు. డాక్టర్ శివ, క్యాంప్ కోఆర్డినేటర్ ఓ.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

75 మంది రక్తదానం



రక్తదాతలను అభినందిస్తున్న అనుశ్రీ సత్యనారాయణ, ఏడిద బాబీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతర బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని అనుశ్రీ ఫిలింస్ అధినేత, జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ప్రారంభించారు. శిబిరంలో 75 మంది రక్తదానం చేశారని ఏడిద బాబీ తెలిపారు.

దేశాభివృద్ధికి రోల్ మోడల్ రాజీవ్ గాంధీ

రాజమహేంద్రవరం సిటీ: దేశాభివృద్ధికి రోల్ మోడల్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని పీసీసీ సభ్యుడు, రాజమహేంద్రవరం నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కృష్ణా నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. జాంపేట వంతెన వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాటం రవి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిల్డర్ బాబీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

ఉత్సాహంగా హ్యాపీ స్ట్రీట్

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హ్యాపీ స్ట్రీట్ కార్యక్రమం నగర వాసులను ఎంతో ఆకట్టుకుంటోంది. జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ సమీపంలోని పరమహంస యోగానంద మార్గ్‌లో ప్రతి ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ ఈ కార్యక్రమం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో నగర ప్రజలు ఉల్లాసంగా పాల్గొంటున్నారు. డ్యాన్సులతో చిన్నారులు హుషారెత్తిస్తున్నారు.

అమ్మవారి సన్నిధి .. అభివృద్ధి సవ్వడి

- రూ.2.14 కోట్లతో భక్తుల మెరుగైన వసతులు
- అదనపు గదుల నిర్మాణం
- పక్కా భవనాలతో షాపింగ్ కాంప్లెక్స్
- కోట సత్తెమ్మకు ఏటా రూ.3 కోట్ల ఆదాయం



అమ్మవారి ఆలయం



కోట సత్తెమ్మ వారు

నిడదవోలు: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న భక్తుల పాలిట కొంగు బంగారంగా కోట సత్తెమ్మ అమ్మవారు విరాజిల్లుతున్నారు. ఎంతో ఖ్యాతి కెక్కిన ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచీ భక్తులు తరలి వస్తారు. అమ్మవారి దర్శనానికి ఉమ్మడి ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, కృష్ణా, గుంటూరు తదితర జిల్లాల నుంచి ఏటా సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది భక్తులు వస్తూంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో సుమారు 30 వేల మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ దేవస్థానానికి ఏటా రూ.3 కోట్ల ఆదాయం వస్తుంది. పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు మెరుగైన వసతులు కల్పించడానికి ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు కృషితో రూ.2.14 కోట్ల వ్యయంతో భక్తులకు అదనపు గదులు, మరుగుదొడ్లు, శాశ్వత అన్నదాన ట్రస్టుకు పక్కా భవనాలు అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు కలిసి వాటికి ప్రారంభించారు. అమ్మవారి ఆలయంలో పాత షాపింగ్ కాంప్లెక్స్‌ను తొలగించారు. రాజగోపురం ఎదురుగా ప్రస్తుతం రూ.32 లక్షల వ్యయంతో పక్క భవనాలతో కూడిన ఏడు షాపులను నిర్మించి ప్రారంభించారు. ఆలయంలో పాత షాపింగ్ కాంప్లెక్స్, ప్రహరీ తొలగించడంతో భక్తుల వాహనాల పార్కింగ్‌కు విశాలమైన స్థలం సమకూరింది. భక్తుల వసతి నిమిత్తం గతంలో 40 పాత రేకుల షెడ్డులు ఉండేవి. వాటిని తొలగించి ఆ స్థానంలో రూ.1.60 కోట్ల వ్యయంతో శ్రీ కోట సత్తెమ్మ సదన్ భవనం, కోటసత్తెమ్మ శాశ్వత అన్నదాన ట్రస్టు భవనాన్ని నిర్మించారు. అంతేగాకుండా బత్తుల సౌకర్యార్థం సుమారు వంద మందికి సరిపడా ఏసీ హాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని అద్దె రోజుకు రూ.4,800 నిర్ణయించారు. సుమారు 200 మంది ఒకేసారి కూర్చుని భోజనం చేయడానికి అనువుగా అన్నదానం భవనాన్ని నిర్మించారు. ఇక్కడ భక్తులు కూర్చోవడానికి వీలుగా స్టీల్‌తో చేసిన టేబుల్స్, కుర్చీలు అందుబాటులో ఉంచారు. ఏటా అమ్మవారి దర్శనానికి రాష్ట్ర నలుమూలూల నుంచి సుమారు పది లక్షల మంది భక్తులు వస్తుంటారు. వారికి మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.22 లక్షల వ్యయంతో మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణాలు చేపట్టారు. ఆ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి.



కొత్తగా నిర్మించిన కోటసత్తెమ్మ సదన్



కొత్తగా నిర్మించిన శాశ్వత అన్నదాన ట్రస్టు భవనం

> **భక్తులకు మెరుగైన వసతులు**
>
> 
>
> ఇక్కడికి వచ్చే భక్తులకు పూర్తిస్థాయిలో అన్ని వవసుతులు కల్పిస్తున్నాం. ఇటీవల ఆలయాన్ని దర్శించిన ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడుల దృష్టికి అమ్మవారి ఆలయం వద్ద చేయాల్సిన పలు పనులను తీసుకువెళ్లాం. కొత్త అన్నదాన భవనం ఎదురుగా భారీ షెడ్డు నిర్మాణానికి శాఖా పరంగా తోడ్పాటు అందించేందుకు మంత్రి అంగీకరించారు. అలాగే మంచినీటి ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణానికి రూ.40 లక్షలతో అంచనాలు, రాజగోపురానికి, ఆలయ ప్రహరీకి, భక్తుల పాత వసతి భవనాలకు రంగులు వేయడానికి రూ.20 లక్షల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.
>
> –బల్ల నీలకంఠం, ఆలయ ఈవో, కోటసత్తెమ్మవారి దేవస్థానం

వైఎస్సార్ సీపీ వార్డు విజేతలు



రావిపల్లి త్రివేణి
పురుషోత్తపల్లి
9వ వార్డు,
నిడదవోలు మండలం(ఏకగ్రీవం)



కొత్తలంక శకుంతల,
కాటకోటేశ్వరం 1వ వార్డు,
నిడదవోలు మండలం(ఏకగ్రీవం)

టీడీపీ, జనసేనలను వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన మద్దూరు నాయకులతో హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: టీడీపీ, జనసేనల నుంచి మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన పలువురు నాయకులు హోం మంత్రి తానేటి వనిత సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వనిత వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నుంచి పెనుమాక శ్రీనివాసరావు, జనసేన నుంచి చెల్లింకుల చిన్నారి, కొరు వెంకటేశ్వర్లు, షేక్ నాగూర్ సలీంలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు, సొసైటీ అధ్యక్షుడు తోట నారాయణ ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివ రామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు



వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు 21వ వార్డులో గడప గడపకూ..

కొవ్వూరు: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో ఆదివారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి అండగా నిలవాలని ప్రజలను కోరారు. ప్రజల సమస్యలను, ఆ ప్రాంత సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఆ వార్డు కౌన్సిలర్ దేవగుప్తాపు చాందిని, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, శ్రీరామా సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవగుప్తాపు లక్ష్మణరావు, స్థానిక నాయకులు వరిగేటి సుధాకర్, సిద్ధన వాసు, పెరుమళ్ల ఉమామహేశ్వరరావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, కౌన్సిలర్ తోట లక్ష్మీప్రసన్న, వరిగేటి లలితకుమారి, పతివాడ నాగమణి, అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, మద్దిపట్ల సాయి గీత, చీరా అరుణ, నాయకులు పాల్గొన్నారు.

ఇక పెయ్య దూడలే పుడతాయి!

- లింగ నిర్ధారణ వీర్య పథకం అమలు
- 300 పశువులకు కృత్రిమ గర్భధారణ
- 90 శాతం విజయవంతం



ప్రయోగంతో పుట్టిన మేలు జాతి పెయ్య దూడ

నల్లజర్ల: కృత్రిమ గర్భధారణతో పశు సంతతిని వృద్ధి చేసే విధానం ఇప్పటి వరకూ అమలులో ఉంది. ఈ పద్ధతిలో గిత్తలు లేదా దున్నల నుంచి సేకరించిన వీర్యాన్ని నేరుగా ఆవులు లేదా పశువులకు ఇంజెక్ట్ చేస్తారు. ఇలాంటపుడు గిత్త లేదా ఆవు దూడలు, పోతు లేదా పెయ్య దూడలు పుట్టేవి. అయితే పాల ఉత్పత్తి పెంచే ఉద్దేశంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కేంద్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకు వచ్చింది. తెలుపు, నలుపు జాతి పశువులు రెండింటికీ ఈ పథకం వర్తిస్తుంది. చూళి పశువులకు ఇకపై పెయ్య (ఆడ దూడ)లే పుట్టేలా లింగ నిర్ధారణ వీర్య పథకం (సెక్స్ సార్టెడ్ సెమన్) అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానంతో మేలైన గేదెల సంఖ్యను పెంచి, దేశంలో క్షీర విప్లవానికి నాంది పలుకుతారని భావిస్తున్నారు. ఈ కొత్త పథకం అమలులోకి వస్తే పాల ఉత్పత్తి పెంపుదలకే గాకుండా పాడి రైతులకు ఆర్థిక పరిపుష్టి కలిగిస్తుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు.

సబ్సిడీపై ఇంజక్షన్

లింగ నిర్ధారణ వీర్య పథకంలో ఒక్కో ఇంజక్షన్ వాస్తవ రేటు రూ.1350. అయితే ఈ మొత్తంలో ప్రభుత్వ సబ్సిడీ రూ.850 ఉంటుంది. రైతు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. పశువు ఎదకు వచ్చిన 20 నుంచి 40 రోజుల వ్యవధిలో పశు పోషకులు పశువైద్యులను సంప్రదిస్తే గేదెకు ఇంజక్షన్ ఇస్తారు. మొదటి సారి చూళి కట్టక పోతే రెండోసారి మళ్లీ ఇంజక్షన్ ఇస్తారు.అదీ విఫలమైతే రైతు చెల్లించిన రూ.500లో సగం రూ.250 రైతు ఖాతాకు జమ చేస్తారు. ఈ పథకం ప్రయోగాత్మకంగా ఇప్పటికే విజయవంతమైంది. దాంతో ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నారు. దీనిని మరింత విస్తరించేలా పశుసంవర్ధక శాఖ ఏడీలు, పశువైద్యులకు శిక్షణ కూడా ఇచ్చారు.

> **90 శాతం విజయవంతం**
>
> 
>
> ఉత్తమ జన్యు లక్షణాలు, మంచి పాలసారం కలిగిన మేలు జాతి దేశవాళీ పశు సంతతిని వృద్ధి చేయడానికి అవసరమైన అత్యాధునిక సాంకేతికత ఇపుడు రైతులకు అందుబాటులోకి వచ్చింది. మండలంలో దాదాపు 300 పశువులకు ఈ తరహా ఇంజక్షన్‌లు ఇచ్చాం.90 శాతం వరకు విజయవంతం అయ్యాయి. పాడి పరిశ్రమ మరింత అభివృద్ధి చెందనుంవది. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> –డాక్టర్ జాన్‌మోజెస్ వెస్లీ, ఏడీ పశుసంవర్ధక శాఖ, నల్లజర్ల

వారంలో ఉపాధి కూలీలకు వేతనాలు

- ఏపీవో సత్యనారాయణ
- ఆందోళన చెందవద్దని వినతి



జగన్నాథపురంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు (ఫైల్)

నల్లజర్ల: ఉపాధి కూలీల వేతనాలు వచ్చే వారంలో వారి ఖాతాలకు జమ అవుతాయని ఉపాధి హామీ ఏపీఓ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. పనులు చేసిన కూలీలు వేతనాల గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. వారికి త్వరలోనే సొమ్ము వస్తుందన్నారు. సోమవారం నుంచి అన్ని గ్రామ పంచాయతీలలో పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సకాలంలో తమకు అందడం లేదని వేతనాలు ఉపాధి హామీ పథకం కూలీలు వాపోతున్నారు. ఏడు వారాలుగా వేతనాలు అందక పోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందంటున్నారు. మండలంలో దాదాపు ఆరు వేల మంది ఉపాధి పనులను నమ్ముకొని జీవిస్తున్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో రైతు వారీ పనులు అంతగా లేవు. ఇక ఉపాధి పనులకు వెళితే సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 24 గ్రామాలకు గాను 10 గ్రామాలలో ఉపాధి పనులను నిలిపి వేశారు. ఇప్పటి వరకప చేసిన పనులకు దాదాపు రూ.30 లక్షలకు పైగానే వేతనాలు అందాల్సి ఉంటుందంటున్నారు. బిల్లులు సకాలంలో అందక అక్కడక్కడా అప్పులు చేస్తున్నట్టు కూలీలు చెబుతున్నారు. వేతనాలు చెల్లించక పోవడంతో రోజూ ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గుతోంది. కూలీల సంఖ్యను పెంచాలని అధికారులు చెబుతున్నప్పటికీ బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదు.

అద్దాలపై.. అందాల కనువిందు

- భక్తుల వాహనాలపై ఆకట్టుకుంటున్న గోవిందుడి శంఖు చక్ర నామాలు, గజ, నెమలి బొమ్మలు
- శ్రీశైలం తరహాలో.. శ్రీవారి కొండపై వేస్తున్న ఆర్ట్స్



శ్రీవారి దేవస్థానం బ్యాటరీ కారు అద్దంపై గోవింద నామం, నెమలి బొమ్మలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల శ్రీవారి కొండపైన భక్తుల వాహనాల అద్దాలపై గోవిందుడి శంఖు, చక్ర నామాలు, గజ, నెమలి, ఓంకారం తదితర ఆర్ట్స్ వేస్తున్నారు. శ్రీశైలం తరహాలో వాటర్ పెయింట్లు, విభూదిని వినియోగించి వేస్తున్న ఈ ఆర్ట్స్ చూపరులను ఆకట్టుకుంటున్నాయి. భక్తులు తమ కార్లు, ఆటోలు, బస్సులు, లారీలపై ఈ ఆర్ట్సను వేయించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాహనాన్ని బట్టి దేవస్థానం నిర్ణయించిన ధరలకు ఈ ఆర్ట్సను వేస్తున్నారు. అద్దాలపై కనిపిస్తున్న ఈ అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.



ఆటో అద్దంపై వేసిన ఆర్ట్



ఆటో అద్దంపై గోవింద నామం, నెమలి బొమ్మలు



కారుపై వేస్తున్న ఓం కారం

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



కొవ్వూరులో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతిని ఆదివారం మండలంలోని వేములూరు గ్రామంలో ఘనంగా నిర్వహించారు.రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్, ఏఐసీసీ సభ్యుడు అమర్‌జహిబేగ్, కాంగ్రెస పార్టీ కొవ్వూరు, చాగల్లు మండల శాఖల అధ్యక్షులు సాకా పుల్లారావు, మట్టా సుబ్బారావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, తమ్మిశెట్టి శ్రీనివాస్, కుక్కిరగడ్డ నాయుడు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేవంలో..

తాళ్లపూడి: భారతీయ యువతకు అధునాతన టెక్నాలజీని టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. పెద్దేవంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి అరుణకుమారి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గెడ్డం సాయిబాబా, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు ఆయన సుబ్బారావు, కొణిదల శ్రీనివాస్, బొనిగే రాంబాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోపాలపురం: పీసీసీ కార్యదర్శి జేష్ట సతీష్‌బాబు ఆధ్వర్యంలో మండలంలోని చిట్యాల గ్రామంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టపర్తి రామ్మోహనరావు, గన్నిన రామారాయుడు, పిట్టా రామారావు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు ప్రధాన కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మట్టా సుబ్బారావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు గల్లా భాస్కరరావు, కొక్కిరిపాటి బుల్లి స్వామి, యూత్ కాంగ్రెస్ నాయకులు అయినం సుబ్రహ్మణ్యం, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆవులు కనిపించడం లేదంటూ రైతుల ఆందోళన



మల్లయ్యపేటలో ధర్నా చేస్తున్న పాడి రైతులు

రాజమహేంద్రవరం రూరల్: నగరపాలక సంస్థ అధికారులు గోశాలకు తరలిస్తున్న ఆవుల్లో కొన్ని కనిపించడం లేదని పాడి రైతులు ఆందోళన చేపట్టారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాతేరు మల్లయ్యపేట వద్ద ధర్నా చేశారు. పాడి రైతులు మాట్లాడుతూ గోసంరక్షణ పేరుతో ఆవులను హింసిస్తున్నారని మండిపడ్డారు. తమకు ఎంత పాడిఉన్నా హిందూ సంప్రదాయం ప్రకారం ఆవులను ఎంతో ప్రేమగా పెంచుకుంటామన్నారు. గృహ ప్రవేశాలకు, దహన కార్యక్రమాలకు ఆవు పిడకలు అమ్ముకుని జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఉమా కోటిలింగేశ్వరస్వామి క్షేత్రంలో పూజలు, పిండ ప్రదానాల కోసం భక్తుల కోరిక మేరకు ఆవులను ఆ క్షేత్రంలో వదిలేస్తామని తెలిపారు. ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, దూర ప్రాంతాల్లోని గోశాలకు తరలిస్తున్నారని, వాటిని తీసుకు రావడానికి రవాణా ఖర్చులుగా రూ.వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. అలాగే గోశాలకు తరలించిన ఆవుల్లో కొన్ని కనిపించడం లేదని ఆరోపించారు. అధికారులను అడిగితే తమను బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో రెడ్డి శ్రీనివాస్, జేవీ గిరిధర్, ఇ.సత్యనారాయణ, ఎ.సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రాధాన్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమానికి టీడీపీ ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం స్థానిక 18వ డివిజన్‌లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు.